నిట్టూరు చెరువు పనులు సాగునా?

- 2006 నుంచి పూర్తి కాని పనులు
- కొత్త ప్రభుత్వంపై రైతుల ఆశలు


చెరువుకట్టపై పెరిగిన కంపచెట్లు

యల్లనూరు: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞం కింద నిట్టూరు చెరువు కట్ట పనులు ప్రారంభించారు. కట్ట పనులు పూర్తయితే అటు సాగు నీరు....ఇటు తాగునీటి కష్టాలు తీరినట్టేనని రైతుల్లో ఆశలు చిగురించాయి. అయితే బడ్జెట్ లేక నిధుల కొరతతో చెరువు పనులు ఆపేసి కాంట్రాక్టర్లు వెళ్లిపోయారు. చెరువుకట్ట పనులు ప్రారంభమై ఇప్పటికి 18 సంవత్సరాలైంది. 2006లో పాత చెరువు కట్ట తొలగించి నూతన చెరువు కట్ట కట్టేందుకు కాంట్రాక్టర్లు పనులు మొదలుపెట్టారు. బడ్జెట్ లేక చాలా ఏళ్లుగా కట్ట పనులు నిలిచిపోయాయి. గాలేరి నగరి సృజల స్రవంతి ఎత్తిపోతల పథకం కింద గండికోట రిజర్వాయర్ నుంచి ఏటూరు పంప్‌హౌస్ ద్వారా మూగు చెరువులకు నీరు అందించాలనే ఉద్దేశ్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైస్ రాజశేఖరరెడ్డి రైతుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకొని మూడు చెరువులకు నీరు వదిలేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ జిల్లా గండికోట నుంచి నీరు ఏటూరు పంప్‌హౌస్‌కు పైపులైన్ ద్వారా వస్తే అక్కడ నుంచి నిట్టూరు చెరువుకు, అక్కడ నుంచి బుక్కాపురం, బొప్పేపల్లి చెరువులు నింపాలి. ఏటూరు పంప్ హౌస్ నుంచి 10 కిలోమీటర్లు పైపులైన్ నిట్టూరు చెరువు వరకూ వేశారు. నిట్టూరు చెరువు నుంచి 8 కిలోమీటర్లు బుక్కాపురం, బొప్పేపల్లి చెరువులకు నీరు వదిలేందుకు అన్ని ఏర్పాటు చేశారు. బుక్కాపురం, బొప్పేపల్లి రైతుల నుంచి భూములు కొనుగోలు పెండింగ్ పడింది. దీంతో ప్రక్రియ ఆలస్యం జరిగింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నిట్టూరు చెరువు పనుల విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికలు సమీపించడంతో పనులు ప్రారంభించలేకపోయారు.

కంపెనీలు మారినా

గండికోట ఎత్తిపోతల పథకం ప్రారంభంలో కేబీఎల్, పీఎల్ఆర్ జేవీ కాంట్రాక్టు పనులు మొదలుపెట్టారు. మళ్లీ గడువు పెంచగా 2018, 2019 సమయంలో ఆర్ శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కంపెనీ టెండర్లను దక్కించుకుంది. మళ్లీ గడువు పూర్తవడంతో కొత్త పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు ముందుకురాలేదు.

నిట్టూరు చెరువు కెపాసిటీ

గండికోట నుంచి ఏటూరు పంప్‌హౌస్, రిజర్వాయరు నిట్టూరు చెరువు రూ.118 కోట్ల వ్యయంతో నూతన కట్ట వేసేందుకు అధికారులు నివేదికలు తయారు చేశారు. నిట్టూరు చెరువు 0.35 టీఎంసీ, బుక్కాపురం చెరువు 0.15 టీఎంసీ, బొప్పేపల్లి చెరువు 0.05టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం ఉందని జేఈ ప్రశాంత్ తెలిపారు. 2019లో రాతికట్టడం కట్టాల్సి ఉండగా ఇసుక లేక సకాలంలో కట్టలేకపోయారు. నిట్టూరు చెరువు బండ్ 10 మీటర్లు ఉండాలి.ని ట్టూరు చెరువు కింద 5,200 ఎకరాల ఆయకట్టు ఉంది. బుక్కాపురం చెరువు కింద 2,800 ఎకరాలు, బొప్పేపల్లి చెరువు కింద 750 ఎకరాల ఆయకట్టు ఉంది.

చెరువుకట్ట భద్రత ప్రశ్నార్థకమే

ప్రస్తుతం నిట్టూరు చెరువుపై ముళ్ల కంపలు ఏపుగా పెరగడంతో చెరువు కట్ట భద్రత ప్రశ్నార్థకంగా ఉంది. చిన్నపాటి వర్షాలకు చెరువుకట్ట బీటలు పారి నీళ్ల లీకేజీ అవుతున్నాయి. నిట్టూరు చెరువుకట్ట పనులు పూర్తి చేసి నీటిని వదిలితే సుమారు 15 గ్రామాలకు నీటి సమస్య ఉండదు. రైతులు ప్రతి ఏటా సస్యశ్యామలంగా పంటలను పండించుకుని ఆనందంగా గడుపుతామని అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు.

పనులు పెండింగ్..

గండికోట నుంచి ఏటూరు వద్ద పంప్‌హౌస్ నిర్మించాలి. అలాగే నిట్టూరు చెరువుకు పైప్‌లైన్ పనులు పూర్తి కావాలి. అలాగే నిట్టూరు చెరువు నుంచి బుక్కాపురం చెరువు వరకూ 8 కిలో మీటర్ల వరకు పైపులైన్ పనులు జరగాల్సి ఉంది. అక్కడ నుంచి బొప్పేపల్లి చెరువుకు నీరు విడుదల కావాలి. ఈక్రమంలో శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి రైతు పక్షాన నిలబడి అసెంబ్లీలో సీఎం చంద్రబాబుతో మాట్లాడి గండికోట ఎత్తిపోతల పథకం నుంచి నిట్టూరు, బుక్కాపురం, బొప్పేపల్లి చెరువులకు నీరు విడుదల చేయిస్తే రైతులు పుష్కలంగా పంటలను పండించుకుంటారు.

మా కల నెరవేర్చాలి



ప్రస్తుత ప్రభుత్వం అన్నదాతల సమస్యలను దృష్టి పెట్టుకుని నిట్టూరు చెరువుకు నీరు వదలాలి. నిట్టూరు చెరువు కింద నాకు ఐదెకరాల భూమి ఉంది. ప్రస్తుతం నీరు సరిగ్గా లేక చీనీచెట్లు ఎండిపోతున్నాయి. చెరువులో నీరు పుష్కలంగా ఉంటే బాగుంటుంది. మరిన్ని పంటలు పండించుకోవచ్చు

– రమేష్, రైతు , పెద్దమల్లేపల్లి

ఎమ్మెల్యే శ్రద్ధ తీసుకోవాలి



నిట్టూరు చెరువుకు నీరు వదిలితే రైతుకు మంచి చేసిన వాళ్లవుతారు. ప్రభుత్వాలు వస్తుంటాయి... పోతుంటాయి. కాని రైతు సమస్యలపై ఎమ్మెల్యే తక్షణం స్పందించాలి. నాకు చెరువుకట్ట కింద ఐదెకరాలు భూమి ఉంది. చెరువుకట్టకు నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాసరెడ్డి, రైతు, నిట్టూరు

రైతులకు ఉపయోగం



గాలేరి నగరి సృజల స్రవంతి ఎత్తిపోతల పథకం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం స్పందించి పూర్తి చేస్తే 25 గ్రామాల్లో తాగు,సాగు నీటి కష్టాలు తీరుతాయి. చిలమకూరు ప్రాంతంలో భూ సేకరణ జరగకున్నా రైతులు కాంట్రాక్టర్ల పై నమ్మకంతో పైపులైన్ పనులు చేయనిచ్చారు. నిధులిస్తే త్వరలోనే పూర్తి చేస్తాం.

– ప్రశాంత్, జేఈ, జీఎన్ఎస్ఎస్

ఘనంగా 'శ్రావణ' పూజలు


వడమాల అలంకారంలో సాలగ్రామ ఆంజనేయస్వామి

తాడిపత్రి అర్బన్: పెన్నానది ఒడ్డున సాలగ్రామ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయమే అభిషేకాలు, అష్టోత్తర శతనామాలతో తులసి అర్చనలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పఠించారు. ఆంజనేయస్వామికి వడమాల సేవ, ఆకు పూజ సేవ నిర్వహించారు. వర్షాలు విరివిగా కురిసి పాడి పంటలతో చల్లగా ఉండాలని వేడుకుంటూ భక్తులు స్వామిని దర్శించుకున్నారు.


పెద్దవడుగూరులో పూజలందుకుంటున్న చెన్నకేశవస్వామి

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తులసి మాల పూజలు, పంచామృతంతో అభిషేకాలు, కుంకుమ అర్చనలను, ఆకు పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి


గుత్తిలోని కోర్టు వద్ద ఉన్న నాగుల కట్టకు పూజలు చేస్తున్న భక్తులు

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లో శనివారం మహిళలు నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుత్తిలోని తాడిపత్రి రోడ్డు, కోర్టు, చెరువు కట్ట, గాంధీ నగర్, కాల్వ గడ్డ ఆంజనేయ స్వామి రోడ్డు, కోట, ఆర్ఎస్‌లోని గౌతమేశ్వరాలయం, పత్తి కొండ రోడ్డు తదితర ప్రాంతాల్లోని నాగుల కట్టలకు ప్రత్యేక పూజలు చేశారు. పాముల పుట్టలలోకి పాలు పోశారు.

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నెతో పాటు పలు గ్రామాల్లో శనివారం నాగులచవితి వేడుకలు మహిళలు భక్తి,శ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామా ల్లో ఉదయం మహిళలు ఉపావాస దీక్షలతో నాగుల కట్టలకు, పాముల పుట్టలోకి పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

తాడిపత్రి అర్బన్: రోటరీ క్లబ్ ఇన్నర్ వీల్ ఆధ్వర్యంలో నేడు ఉచిత బీఎండీ (ఎముకల సాంద్రత పరీక్షలు) నిర్వహించనున్నట్లు ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు కౌసర్‌బేగం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు హనుమాన్ జంక్షన్‌లోని రోటరీ క్లబ్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

యాడికి: తాడిపత్రి మండలంలోని పెన్నానదిలో నుంచి అక్రమంగా ఇసుకను యాడికి మండలం గుండా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం బూరుగల గ్రామానికి చెందిన రంగరాజు తన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా చింతలాయ పల్లె గ్రామ శివారులో పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి నిందితుడు రంగరాజును అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి

గార్లదిన్నె: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏఓ సోమశేఖర్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

కత్తితో బెదిరించి పర్సు, సెల్‌ఫోన్ అపహరణ

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో శనివారం తెల్లవారుజామున ప్రయాణికుడిని కత్తితో బెదిరించి పర్సు, సెల్‌ఫోన్‌ను అపహరించిన దొంగపై రైల్వే పోలీసులకు ఫిర్యాదు అందింది. మండలంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి స్వస్థలం నుంచి రాయలసీమ రైలులో తెల్లవారుజామున తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో దిగాడు. ప్లాట్ ఫారం చివర దిగి ఒంటరిగా బయటకు వస్తుండడంతో ఓ దొంగ కత్తిని చూపించి పర్సు, సెల్‌ఫోన్ లాక్కున్నాడు. ఆ ఉద్యోగి వెంటనే రైల్వే పోలీసులకు సమాచారమిచ్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు.

108లో ప్రసవం


శిశువును చూపుతున్న 108 సిబ్బంది

పెద్దవడుగూరు : 108 వాహనంలో ఓ గర్భిణి పండంటి శిశువుకు జన్మనిచ్చింది. వివరాలు.. ముప్పాలగుత్తి గ్రామానికి చెందిన అరుణకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను క్రిష్టిపాడు ప్రభుత్వ ఆసుపత్రి తీసుకొచ్చారు. తర్వాత ఆమెను గుత్తికి రెఫర్ చేశారు. అయితే అక్కడి వైద్యులు అనంతపురం తీసుకెళ్లాలని సూచించడంతో 108 వాహనంలో బయలుదేరారు. పామిడి సమీపంలోకి చేరుకోగానే నొప్పులు అధికకావడంతో ఈఎంటీ రవి వాహనాన్ని పక్కకు ఆపి కాన్పు చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటీ తెలిపారు.

గొర్రెకు శస్త్రచికిత్స విజయవంతం


గొర్రెకు శస్త్ర చికిత్స చేసి పిల్లను బయటకు తీస్తున్న డాక్టర్ పద్మనాభం

గార్లదిన్నె: మండలంలోని పి.కొత్తపల్లిలో కాపరి ఎర్రిస్వామికి చెందిన ఒక గొర్రెకు శనివారం శింగనమల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ పద్మనాభం శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. వివరాలు.. ఎర్రిస్వామికి చెందిన ఒక గొర్రె ఈనడానికి ఇబ్బందిపడుతుంటే సమీపంలోని యర్రగుంట్ల పశువైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ పశువైద్యాధికారి డాక్టర్ ఆంజనేయులు నాయక్ గొర్రెను పరీక్షించి మడి ద్వారా గొర్రె ఈనడానికి ఇబ్బంది పడుతుందని వెంటనే శింగనమల ప్రాంతీయ పశువైద్యశాలలో శస్త్ర చికిత్స చేయాలని రెఫర్ చేశారు. డాక్టర్ పద్మనాభం గొర్రెకు ఆపరేషన్ చేసి, కడుపులో చనిపోయిన గొర్రె పిల్లను బయటకు తీశారు. గొర్రె కడుపులో గర్భం మెలిక తిరిగి రెండు రోజులు కావడంతో గర్భంలోనే పిల్ల చనిపోయింది. అదేవిధంగా రక్తం సరఫరా కాక గర్భం కుళ్లడం మొదలైంది. గొర్రెకు యాంటీబయాటిక్స్, అనాలజీసిక్స్,ఫ్లూయిడ్స్ ఇచ్చి ఇంటికి పంపామని డాక్టర్ పద్మనాభం తెలిపారు. శస్త్ర చికిత్సలో రంగనాయకమ్మ, నారాయణ స్వామి, చంద్రశేఖర్, వెంకటకృష్ణ,మమత, మైథిలి, నాగరాజు, సురేంద్ర సహాయ సహకారాలు అందించారు.

ఉర్దూ జూనియర్ కాలేజీ ప్రారంభించండి


కాలేజీ భవనాలను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

గుంతకల్లుటౌన్: పట్టణంలో 9 సంవత్సరాల క్రితం మైనార్టీ సంక్షేమ శాఖ నిధులు రూ.2 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కాలేజీ, హాస్టల్‌ను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒ.పరమేష్ డిమాండ్ చేశారు. శనివారం ఉర్దూ కాలేజీ భవనాలను ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాలేజీ, హాస్టల్స్‌లో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించని కారణంగా భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయన్నారు. కాలేజీ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయని, కాలేజీలో నిర్మాణ సామగ్రి దొంగల పాలవుతోందన్నారు. ప్రభుత్వం అధ్యాపకులు, వార్డెన్, బోధనేతర సిబ్బందిని నియమించి ఉర్దూ కాలేజీ, హాస్టల్‌ను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకటేష్, నాయకులు శివ, చందూ, మణికంఠ, కేశవ్, కార్తీక్‌లు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

పామిడి: పామిడి పంచాయతీకి సంబంధించి ఉపాధి పనుల్లో జాప్యాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీనియర్ నాయకులు పీ అనిమిరెడ్డి, కే రహీమ్ కోరారు. శనివారం పామిడిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పామిడి పంచాయతీలో ఉపాధి పనులు లేక కూలీలకు జీవనం గడవడం కష్టతరమైందన్నారు. కూలీలు వలసబాట పడుతున్నారన్నారు. వ్యవసాయ కూలీలు, కార్మికుల సమస్యలపై పలుమార్లు అధికారులకు అర్జీలు ఇచ్చిన పట్టించుకున్న పాపానపోలేదన్నారు. సోమవారం నిర్వహించే ధర్నాకు పామిడితో పాటు పంచాయతీ పరిధిలోని పీ కొత్తపల్లి, పీ కొండాపురం గ్రామాల వ్యవసాయ కూలీలు, కార్మికులు హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో వామపక్షపార్టీల మండల నాయకులు నాగరాజు, మల్లేసు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

గుంతకల్లు: పెన్షనర్ల సమస్యలను పరిష్కారించాలని ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక మండీ బజార్ సమీపంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జయరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ పెన్షనర్లలో చాలా మంది పేదవాళ్లు ఉన్నారని, వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలన్నారు. ఇక అసోసియేషన్ కార్యాలయం ఇరుకుగా ఉండడంతో పైఅంతస్తు ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కార్యాలయం సమీపంలో మున్సిపాలిటీ సిబ్బంది పెద్ద డస్ట్‌బిన్ ఏర్పాటు చేయడంతో దుర్వాసన వేస్తోందని, డస్ట్‌బిన్‌ను అక్కడ నుంచి తీసివేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

చింతలరాయుడి సన్నిధిలో అదనపు జడ్జి

తాడిపత్రి అర్బన్: ప్రాచీన చింతల వెంకటరమణస్వామి ఆలయాన్ని అదనపు జడ్జి శ్రీహరి శనివారం సందర్శించారు. అర్చకులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా జడ్జి మూలవిరాట్ చింతల వెంకటరమణస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని ఆనందవల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అదనపు జడ్జికి అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

భార్యపై భర్త దాడి

తాడిపత్రి అర్బన్: మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వలేదని భార్యపై భర్త దాడికి పాల్పడిన ఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. అర్బన్ సీఐ నాగేంద్రప్రసాద్ వివరాల మేరకు.. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన నాగార్జున అనే వ్యక్తి మద్యానికి బానిసై రోజూ భార్య నాగరత్నతో మద్యానికి డబ్బులు ఇవ్వాలని గొడవపడుతుండేవాడు. ఎప్పటిలాగే శనివారం కూడా అతడు మద్యం సేవించేందుకు భార్యను డబ్బులు డిమాండ్ చేశాడు. ఇందుకు ఆమె నిరాకరించడంతో ఆగ్రహించిన భర్త ఆమెపై దాడి చేశాడు. దాడిలో నాగరత్న తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్ చేసుకోండి


మాట్లాడుతున్న గేట్స్ ఎండీ రఘునాథ్‌రెడ్డి

గుత్తి: ఇంజినీరింగ్ విద్యార్థులు ఇంటర్వ్యూ, కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్ చేసుకోవాలని గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, డైరెక్టర్ వీకే వాణి సూచించారు. గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఫస్టియర్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమయాన్ని వృథా చేసుకోవద్దనన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తన్వీర్, హెచ్ఓడీ హరిప్రియ, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు నారాయణస్వామి

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ హైస్కూల్లో శనివారం ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవ ం పురష్కరించుకుని క్రికెట్ టోర్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు నారాయణస్వామి మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలు ఆడాలన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పది రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి, సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'పైలా' కబ్జా కోరు


బీజేపీ మండల అధ్యక్షుడు రాంబాబు

తాడిపత్రి రూరల్: పైలా నరసింహయ్య ఓ కబ్జా కోరు, బ్లాక్ మెయిల్ రాజకీయ నాయకుడని బీజేపీ మండల అధ్యక్షుడు రాంబాబు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకట న విడుదల చేశారు. పైలా కుల రాజకీయాలు చేస్తూ స్వార్థ ప్రయోజనాలకు పాల్పడుతున్నాడన్నారు. పార్టీలు మారుస్తూ దందాలతో అక్రమంగా ఆస్తులు పెంచుకుంటున్నాడన్నారు. అవినీతి రాజకీయాలతో పబ్బం గడుతున్నాడన్నారు. కుల, మత రాజకీయాలు చేసే పైలాకు బీజేపీలో ఉండే అర్హత లేదన్నారు. పైలాకు తాడిపత్రి ప్రాంత పార్టీ నాయకుల నుంచి ఎలాంటి సహకారం ఉందదన్నారు. అవినీతి మయమైన పైలా చరిత్రను దృష్టిలో ఉంచుకుని పార్టీ నుంచి బహిష్కరించాలని రాష్ట్ర, జిల్లా నాయకులను ఆయన డిమాండ్ చేశారు.

పాముకాటుతో బాలుడికి అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ఉపేంద్ర అనే బాలుడు పాముకాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఉపేంద్ర అనే బాలుడు శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాముకాటు వేసింది. కుటుంబీకులు వెంటనే ఉపేంద్రను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం బాలుడిని వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: నియోజకవర్గంలోని రైతులకు తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ అందించాలని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే తన నివాసంలో ట్రాన్స్‌కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని పెద్దవడుగూరు, యాడికి, పెద్దపప్పూరు, తాడిపత్రి మండలం, పట్టణానికి నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సరఫరా చేయాలని సూచించారు. విద్యుత్ కోతల వల్ల నియోజకవర్గంలోని చేనేతలకు ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుత్తి డీఈ రాజశేఖర్, తాడిపత్రి ఏడీ రఘు, రూరల్ ఏడీ వసంతకుమార్, ఏఈలు ఉదయ్‌బాస్కర్, వీరాంజనేయరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాజారావు, మధుసూదన్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేడు కేవీకేలో రైతు సదస్సు

బుక్కరాయసముద్రం: రెడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా రూపొందించిన 109 రకాల పంటలను దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారన్నారు. కార్యక్రమాన్ని కేవీకేలో లైవ్ టెలీకాస్ట్ చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి రైతులందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పామిడి: పట్టణంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై వెంగమనాయుడుకాలనీ సమీపాన శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. పట్టణానికి చెందిన ప్రజాశక్తి విలేకరి వాల్మీకి గోపాల్, బేల్దారి గడ్డం నాగరాజు ద్విచక్ర వాహనంలో హైవే వైపు మోటరుసైకిల్‌లో బయలుదేరారు. సంఘటనా స్థలానికి వచ్చే సరికి మోటారు సైకిల్‌కు వీధికుక్క అడ్డు వచ్చింది. బైక్‌లో కిందపడి ఇద్దరూ గాయపడ్డారు. వారిని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ఆసుపత్రికి రెఫర్ చేశారు.

ద్విచక్ర వాహనం బోల్తా.. వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని మార్నేపల్లి శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం బోల్తా పడి లక్ష్మన్న అనే వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం మునిమడుగు గ్రామానికి చెందిన లక్ష్మన్న సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారిలో పనులు ముగించుకుని శుక్రవారం అర్ధ రాత్రి బైక్‌లో స్వగ్రామానికి బయలుదేరాడు. మార్నేపల్లి గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడిన లక్ష్మన్నను 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు

యల్లనూరు: గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. యల్లనూరు పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పల్లెల్లో ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్‌కు వచ్చి సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సంపత్‌కుమార్, శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ జాతర

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని బండిమోటు వీధిలో ఆదివారం ముత్యాలమ్మ జాతర నిర్వహించనున్నట్లు ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్ష , కార్యదర్శులు గంగాధరన్, సుబ్బరాయుడునాయుడు(నర్రి) తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం ఆరు గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ముత్యాలమ్మను దర్శించుకుని , జాతరను విజయవంతం చేయాలని వారు కోరారు.

వర్షం కోసం పూజలు

తాడిపత్రి అర్బన్: వర్షాలు కురవాలని కోరుతూ బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. శనివారం పట్టణంలోని గాంధీకట్ట సమీపంలోని సత్యమ్మ అమ్మవారికి 101 బిందెలతో జలాభిషేకం చేశారు. బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంకాల్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ కన్వీనర్ గంగాధర్‌యాదవ్, నియోజకవర్గ కన్వీనర్ రంగనాథ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.